క్లుప్తంగా

జాతీయ పురస్కారానికి ఎంపిక


జేసీ రాజు

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న జేసీ రాజు అరుముళ్ల తెలుగు వెలుగు జాతీయ జ్యోతిరావు పూలే అవార్డుకు ఎంపికైనట్టు తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తములను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే వేడుకల్లో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు వివరించారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక

కాటారం : రజక సంఘం కాటారం గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పున్నం రాజయ్య, అధ్యక్షుడిగా ముసాపురి నర్సయ్య, ఉపాధ్యక్షుడుగా గుండ్లపల్లి అశోక్, ప్రచార కార్యదర్శిగా పున్నం సతీశ్, కోశాధికారిగా పున్నం శంకర్, ప్రధాన కార్యదర్శిగా పైడాకుల మహేందర్, ముఖ్యసలహాదార్లుగా సురేశ్, ముసాపురి అయిలయ్య, సభ్యులుగా అంజయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, మల్లయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, రాంచంద్రం, వెంకటస్వామి, ఎన్నికయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, మజీద్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు రామగుండం రామ్మూర్తి, శ్రీపాల్‌లను తోటి ఉపాధ్యాయులు కాళేశ్వరం పాఠశాలలో మంగళవారం పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, రాజు, లక్ష్మి, పెంటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు రూ.కోటి మంజూరు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల–కొయ్యూరు నాగులమ్మ వరకు నిర్మించిన డబుల్ రోడ్డు మరమ్మతు కోసం జెన్‌కో ద్వారా రూ.కోటి మంజూరైనట్లు ఆర్ అండ్ బీ ఏఈ అవినాష్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పెద్దతూండ్ల ఇప్పల క్రాస్ నుంచి తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం వరకు దెబ్బతిన్న ప్రదేశాల్లో ప్యాచ్ వర్క్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆ రోడ్డును ఎస్ఈ నాగేందర్‌రావు మంగళవారం పరిశీలించినట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.స్పష్టం చేశారు.

హనుమాన్ ఆలయంలో భజనలు



మహాముత్తారం : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని బోర్లగూడెంలోని హనుమాన్ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఆనవాయితీ ప్రకారం ప్రత్యేక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, భక్త మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు నడిపించండి



కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం నుంచి మంథని, పెద్దపల్లి, కరీంగనర్ మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించాలని డిపో మేనేజర్ రాజశేఖర్‌ను జెడ్పీటీసీ గుడాల అరుణ కోరారు. ఆర్టీసీ అధికారులు రూట్‌ను పరిశీలించడానికి మంగళవారం రాగా తొలుత డీఎంను అరుణ శాలువాతో సన్మానించారు. అనంతరం డీఎంతో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎంజిల్, ఎస్టీఐ గోపాల్, సిబ్బంది చంద్రమౌళి, రమేష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి


వాజేడు : రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

ఏటూరునాగారం : ప్రతీఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సుచరిత సూచించారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం జ్వరాలతో బాధపడుతున్న పలువురిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాబు, ఆశవర్కర్, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

వాజేడు : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాల తీవ్రతపై సర్వే నిర్వహించారు. ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించారు. ప్రజలకు మరుగునీటిని తొలగించాలని, ఇతరత్రా సూచనలు చేశారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. జ్వరాలతో బాధపడుతున్న పలువురిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం వైద్యులు మహేందర్, గ్నానస మాట్లాడారు. జ్వరాల పట్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కోటిరెడ్డి, శేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

వెంకటాపురం (కె) : మండలంలోని చినగంగారం గ్రామంలో ప్రజలు డెంగ్యూ, జ్వరాల బారిన పడుతుండడంతో వైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం సర్పంచ్ నర్సింహమూర్తి వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పైత్రేన్ మందు స్ప్రే చేయించారు.


దోమల మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

సీతక్కపై సతీష్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న సృజన

ములుగు : ఎమ్మెల్యే ధనసరి సీతక్కపై రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజన అన్నారు. మహిళా ఎమ్మెల్యే అయిన సీతక్కపై అనుచిత వాఖ్యలు చేసిన సతీష్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో సృజన మాట్లాడారు. సతీష్‌రెడ్డి రెడ్కో చైర్మన్‌గా జిల్లా ప్రజలకు ఏం చేశాడని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఆడవాళ్ల చీరల గురించి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని మండపడ్డారు. పరస్పర ఆరోపణలు చేయడం కూడా అర్థవంతంగా ఉండాలని హితవు పలికారు. మరోసారి సీతక్కను తక్కువ చేసి మాట్లాడితే తగిన రీతిలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపిదాసు రజిత, గోవిందరావుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు సునీత, మాజిదా బేగం, దేపాక సంధ్య, ముచికట్ల మహాలక్ష్మి, పులసం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో బీఆర్ఎస్ నాయకుల చేరిక


బీజేపీలో చేరిన నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని కార్యాలయంలో ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్‌తో కలిసి మంగళవారం బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు అలేటి జయపాల్‌రెడ్డి, సంజీవరెడ్డితోపాటు సుమారు 10 మంది చేరగా వారికి నేతలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆశ కార్యకర్తల వేతనం పెంచాలి

ములుగు : ఆశ కార్యకర్తలకు వేతనాన్ని రూ.18 వేలకు పెంచి చెల్లించాలని స్థానిక ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆశ కార్యకర్తలు కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించారని గుర్తు చేశారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని ప్రభుత్వ పథకాల అములులో భాగస్వాములౌతున్నారని తెలిపారు. కష్టపడి పని చేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వం విస్మరించడం సమంజనం కాదన్నారు. ఆశ కార్యకర్తలకు రూ.18 వేల చొప్పున ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని,, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆశాకార్యకర్తల పోరాటంలో భాగస్వాములౌతామని చెప్పారు.

15 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

ఎస్ఎస్ తాడ్వాయి : ఈనెల 15 నుంచి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు కన్వీనర్, పాఠశాల హెచ్ఎం ఎల్.పద్మ, నిర్వాహకురాలు బి.సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 17 ఏళ్ల బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో క్రీడాపోటీలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్ : విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు విమర్శించారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎంహెచ్ లేక ఎస్సీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యలపై అనేక ఏళ్లుగా వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లా కేంద్రానికి ఎస్సీ బాల బాలికల ఎస్ఎంహెచ్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న బోజనం అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నం ప్రవీణ్, రవితేజ, స్వామి, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

ములుగు రూరల్ : గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు ఈర్ల జంపయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మంగళవారం పరామర్శించారు. పూలమాలతో నివాళులర్పించారు. జంపయ్య మృతి బాధాకరమన్నారు. సర్వర్ చారిటబుల్ ట్రస్టు అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యంతోపాటు రూ.2 వేల నగదు సాయం అందించారు.

కోతులు, కుక్కల స్వైరవిహారం


మండల కేంద్రంలో సంచరిస్తున్న కుక్కల గుంపు

టేకుమట్ల : మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. అవి దాడులకు పాల్పడుతుండడంతో మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నిత్యం ఇళ్లల్లోకి కోతులు వస్తూ నానా భీభత్సం సృష్టిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అన్ని గ్రామాల్లోనూ కుక్కలు పదుల సంఖ్యలో గుంపుగా సంచరిస్తూ రోడ్డు వెంట వెళ్తున్న పాదచారులను, ద్విచక్ర వాహనదారులను వెంట పడి కరుస్తున్నాయి. మండలంలోని బూర్నపల్లిలో మంగళవారం నేరెళ్ల కొమురయ్య, చిన్నయ్య కోతుల దాడిలో గాయాల పాలవగా ఆశిరెడ్డిపల్లిలో మారుతీ అనే బాలుడు కుక్క కాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ కుక్కలు, కోతుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

18 ఏళ్లు నిండితే ఓటు తప్పనిసరి

మల్హర్ : అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండితే తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్ తెలిపారు. మండలంలోని ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదుపై మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత ఓటును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటరు పాత్ర, ఓటు హక్కు ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన మహాముత్తారం

- రేగులగూడెంలో పదుల సంఖ్యలో జ్వరపీడితులు


జ్వర పీడితురాలు

మహాముత్తారం : మండలంలోని పాత, కొత్త రేగుల గూడెంతోపాటు బోర్లగూడెం, పోచంపల్లి గ్రామాలు జ్వర పీడితులతో మంచంపట్టాయి. కొద్ది రోజులుగా ఏకదాటిగా వర్షాలు కురుస్తుండడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సైతం చేపట్టని పరిస్థితుల్లో దోమలు వ్యాప్తి చెందున్నాయి. సుమారు 20 రోజులుగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలానికి చెందిన చీపురు మధునమ్మ, కోట స్వామి, లచ్చక్క, దుర్గ, కొండేటి శ్రీలత, నర్సక్క, లక్ష్మీతోపాటు పలువురు జ్వరాలతో బాధపడుతున్న దుస్థితి నెలకొంది. ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకున్నా జ్వరాలు తగ్గడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడాన్ని జిల్లా అధికార యంత్రాంగం, వైద్య శాఖ విస్మరించాయని పలువురు మండిపడుతున్నారు. బోర్లగూడెంకు చెందిన ఐర్నేని సుభాషిణి సుమారు వారం రోజులుగా డెంగ్యూతో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతోంది. వైద్యాధికారులు సత్వరమే స్పందించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అవగాహనతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట

కాళేశ్వరం : అవగాహన పెంచుకుంటే అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయొచ్చని షీ టీం డబ్ల్యూహెచ్‌ఓ దేవేంద్ర తెలిపారు. షీ టీం జిల్లా ఇన్‌చార్జ్ అజయ్, ఎస్సై శ్రీలత ఆదేశాల మేరకు మహదేవపూర్ మండలంలోని సూరారం ప్రభుత్వ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి దేవేంద్ర మాట్లాడారు. విద్యార్థులు, మహిళలు సైబర్ క్రైం, వేధింపులు, ఇతరత్రా అన్ని అంశాల్లోనూ చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఆపద ఎదురైనా వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో షీ టీంకు సెల్ నంబర్ 872658162కు ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులకు, మహిళలకు పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాజిద్, కానిస్టేబుల్ నరేష్, ఇర్ఫాన్, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.35 వేల సాయం


చెక్కు అందజేస్తున్న పీఓ అంకిత్


విద్యార్థికి నగదు అందజేస్తున్న ఏఎస్పీ

ఏటూరునాగారం : గోవిందరావుపేట మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన గొంది సచిన్ నిట్‌లో ఉన్నత విద్యలో చేరేందుకు ఐటీడీఏ పీఓ అంకిత్ మండల కేంద్రంలోని తన కార్యాలయంలో రూ.35 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా పీఓ అంకిత్ మాట్లాడారు. సచిన్ నిట్‌లో కెమికల్ ఇంజనీరింగ అభ్యసించేలా ఫీజు కోసం ఆర్థికసాయం అందజేసినట్టు చెప్పారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి..

వాజేడు మండలంలోని ఎడ్జెల్లపల్లి గ్రామానికి చెందిన గోగు మమతకు సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ విద్య అభ్యసించేందుకు ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సేకరించిన రూ.30 వేల నగదును ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మమతను ఏఎస్పీ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సీఐ మండల రాజు, ఎస్సై కృష్ణప్రసాద్, ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సయ్యద్ వహీద్, యర్రమనేని సతీష్, బండపల్లి సంతోష్, కొయ్యల సతీష్, పరికి వేణు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తదితరులు పాల్గొన్నారు.

గణితంలో నైపుణ్యం పెంచేలా కరదీపిక


కరదీపిక విడుదల చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు

ములుగు రూరల్ : విద్యార్థులు గణితంలో నైపుణ్యం పెంచుకునేలా కరదీపిక ఉపయోగపడుతుందని చల్వాయి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కుంజ రాజేశ్వర్‌రావు తెలిపారు. గోవిందరావుపేట మండలంలోని ఆ స్కూల్‌లో కరదీపికను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో తరగతుల వారీగా సిలబస్‌లోని గణిత భావనలను ఒకచోట చేర్చి పూర్తి స్థాయిలో పట్టు లభిచేందుకు కరదీపిక ఉపకరిస్తుందని తెలిపారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులు మరిచిపోయిన సూత్రాలను, కీలక భావనలను గుర్తు చేసుకుని నైపుణ్యం పెంచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులందరికీ కరదీపికను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొలుగూరి రమేష్, చలగురుగుల మల్లయ్య, శ్యాంసుందర్, శ్రీనివాసరావు, వెంకటరమణమూర్తి, శ్రీదేవి, రాయబారపు దీప్తి, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజన విధులకు దూరం


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వాజేడు : నేటి (బుధవారం) నుంచి మధ్యాహ్న భోజన విధులకు దూరంగా ఉంటామని కార్మికులు తెలిపారు. ఈ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు ఎంఈఓ వెంకటేశ్వర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్మికులు మాట్లాడారు. కొన్నేళ్లుగా నెలకు కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇస్తునఆనరని చెప్పారు. నెలకు రూ.2 వేలు చొప్పున ఇస్తామని 2022లో సీఎం కేసీఆర్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటించినా అమలు చేయలేదని తెలిపారు. వంట సామాగ్రి బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయని, కిరాణా దుకాణాల్లో సరుకులు ఇవ్వడం లేదని చెప్పారు. వెంటనే తమకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు నెలకు రూ.2 వేలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న దావూద్

ఏటూరునాగారం: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండి.దావుద్ అన్నారు. మండల కేంద్రలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మక్క మాట్లాడుతూ అంగన్‌వాడీలు శాంతియుతంగా నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు జమున, సరిత, లలిత, వెంకటేశ్వరి, అరుణ, విజయలక్ష్మి, రుక్మిణి, ఇందిర, రమాదేవి, నిర్మల, సుమలత, ఆదిలక్ష్మి, దమయంతి, పార్వతి పాల్గొన్నారు.

15 నుంచి ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలు

కాటారం : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల సంక్షేమ బాలుర పాఠశాలలోని మైదానంలో ఈనెల 15, 16 తేదీల్లో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ దేవానాయక్ తెలిపారు. ఆ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్స్, సెలక్షన్స్ నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి కలిగిన విద్యార్థులు సంబంధిత పాఠశాల నుంచి స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్లు వెంట తీసుకొని 15న ఉదయం 9 గంటలలోగా మండల కోఆర్డినేటర్ మంథని శ్రీనివాస్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9951421678లో శ్రీనివాస్‌ను లేదా సెల్ నంబర్ 7337439849లో పీఈటీ రాధను సంప్రదించాలని తెలిపారు. అండర్–14 కబడ్డీ విభాగంలో బాలురు 51 కిలోలు, బాలికలు 48 కిలోలు మించరాదని స్పష్టం చేశారు. అలాగే అండర్–17 బాలుర విభాగంలో 55 కిలోలు, బాలికలు 55 కిలోలు మించి ఉండకూడదని తేటతెల్లం చేశారు.

రేపటి నుంచి ఎంపిక

టేకుమట్ల : 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) మండల స్థాయి క్రీడా పోటీలకు రేపటి (గురువారం) నుంచి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు ఎంఈఓ కోడెపాక రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, అండర్–17 బాల బాలికలకు ఖోఖో, ఖబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.